

బడంగ్‌పేట్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మహిళలతో కలిసి విజయ సంకేతం చూపుతున్న మాజీ మేయర్ పారిజాతారెడ్డి



వ్యవసాయ మార్కెట్‌లో చైర్‌పర్సన్ లక్ష్మిని సన్మానిస్తున్న మహిళలు



సుభద్రనగర్‌లో మున్సిపల్ కార్మికులను సన్మానిస్తున్న హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



వేడుకల్లో పాల్గొన్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మన్సూరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎల్బీనగర్, మహేశ్వరం, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళా అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బందితో పాటు స్వచ్ఛంద సేవలు, రాజకీయ రంగాల్లో రాణిస్తున్న మహిళలను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సమాజంలో స్త్రీ ప్రాధాన్యతను గురించి కొనియాడారు.

నాగోల్ రాక్‌టౌన్ కాలనీలో..

నాగోల్ డివిజన్ రాక్‌టౌన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభకనబర్చిన మహిళలను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మాంచారు.

మన్సూరాబాద్‌లోని దుర్గాదేవి ఆలయంలో..

మన్సూరాబాద్ డివిజన్ శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో మహిళా దినోత్సవాన్ని ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలచే కేక్‌ను కట్ చేయించి పలు రంగాల్లో రాణిస్తున్న వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

కమ్మ మహిళా సంఘం ఆధ్వర్యంలో..

ఎల్బీనగర్‌లోని ఓ ప్రైవేటు కాన్ఫరెన్స్ హాలులో కమ్మ మహిళా సంఘం ఎల్బీనగర్ అధ్యక్షురాలు మంజుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా ది నోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు కేక్‌లు కట్ చేశారు. పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సరూర్‌నగర్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 31వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొని పలువురు మహిళా నేతలు, కాలనీ మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక మహిళలు పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

మహిళా పోలీసులకు సన్మానం

మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందిని మహిళా దినోత్సవం సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కీసర నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారితో కేక్ కట్ చేయించి, మిఠాయిలు అందజేసి శాలువాలు కప్పి సత్కరించారు.

మహాత్మాగాంధీ లా కాలేజీలో..

ఎల్బీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆర్కేపురం డివిజన్ చిత్రాలేఅవుట్‌లోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అనంతరం కేక్‌లు కట్ చేసి కళాశాల మహిళా అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

చంపాపేట: హస్తినాపురం డివిజన్ నందనవనంలోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు.

హయత్‌నగర్: హయత్‌నగర్ మండల భారత జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాతా ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య జెండాను ఎగుర వేశారు. అనంతరం మహిళలు అందరు కలిసి కేక్ కట్ చేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానవవనరుల శాఖ జనరల్ మేనేజర్ సోనియాశ్రీకాంత్, జేఎన్‌టీయూ అసోసియేట్ ప్రొఫెసర్ నీరజ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు.

వనస్థలిపురం: మహిళా దినోత్సవాన్ని వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్ డివిజన్‌లలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పారిశుధ్య కార్మికులను సన్మానించారు.

కొత్తపేట: కార్పొరేటర్ కార్యాలయంలో మహిళా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. డివిజన్ మహిళా నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ మహిళా నాయకులను సన్మానించి, చీరలను బహూకరించారు.

సైదాబాద్: మహిళా దినోత్సవాన్ని సైదాబాద్, మాదన్నపేట, మలక్‌పేట ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. కార్పొరేటర్లు కొత్తకాపు అరుణారెడ్డి, జంగం శ్వేతారెడ్డిలను పలు మహిళా సంఘాల ప్రతినిధులు కలిసి సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వాణినగర్‌లో పారిశుధ్య కార్మికులను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ దంపతులు సన్మానించారు.

అనిబిసెంట్ మహిళా కళాశాలలో..

చాదర్‌ఘాట్: దిల్‌సుఖ్‌నగర్‌లోని అనిబిసెంట్ మహిళా కళాశాలలో మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ ఉషారాణి, శ్రీనివాసులు నాయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో..

ఓల్డ్‌మలక్‌పేట: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మార్కెట్ మహిళా ఉద్యోగులను, చైర్‌పర్సన్‌ను శాలువాలు, బొకేలతో సన్మానించారు. ఉద్యోగులు పుష్పలత, మాధురి, జయలక్ష్మి పాల్గొన్నారు.

హయత్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా ఎస్‌ఐలు, మహిళా కానిస్టేబుల్‌లు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సీఐ నాగరాజుగౌడ్ మహిళలను శాలువతో సన్మానించి మొక్కను, చీరలను అందించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మీనారాయణ, నెహ్రూనాయక్, ఏఎస్ఐ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



సైదాబాద్‌లో కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డిని సన్మానిస్తున్న విద్యావేత్త గోవర్ధన్‌రెడ్డి



కార్పొరేటర్ అరుణారెడ్డిని సన్మానిస్తున్న మహిళా సంఘం సభ్యులు



నందనవనంలోని వార్డు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్



అనిబిసెంట్ కళాశాల వేడుకల్లో పాల్గొన్న ఉషారాణి, శ్రీనివాసులునాయుడు, సెక్రటరీ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులను శాలువతో సన్మానిస్తున్న సీఐ నాగరాజుగౌడ్, సిబ్బంది



మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పాల్గొన్న ఎస్ఐలు, ఇతర సిబ్బంది



ఎల్బీనగర్‌లో విశ్రాంతి ఉద్యోగిని సునీతను సన్మానిస్తున్న కమ్మ సంఘం ఎల్బీనగర్ అధ్యక్షురాలు మంజుల, సభ్యులు



మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవంలో కళాశాల కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి

వయోవృద్ధుల అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్యే

వనస్థలిపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఫ్రీ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో శనివారం ఏర్పాటు చేసిన వైద్య పరికరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హాస్పటలైజన్ వారికోసం రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పేషంట్ ఆఫ్ అండ్ డౌన్ బెడ్స్, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్స్, వీల్‌చైర్స్, వాకర్స్‌ను పూర్తిగా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. వీటిని అవసరం ఉన్నన్ని రోజులు వాడుకుని తిరిగి ఇచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రెడీ టు సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ పెద్ద శంకర్, బతుకమ్మ సినిమా హీరో విజయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఐ లవ్ లింగోజీగూడ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి

కలిసి శిలాఫలకం - విడివిడిగా లోగో కార్యక్రమం

ఎల్బీనగర్ : ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ప్రియదర్శిని పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఐ లవ్ లింగోజిగూడ లోగో ప్రారంభోత్సవం శనివారం నిర్వహించారు. లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డిలు కలిసి ఆవిష్కరించారు. అనంతరం లోగో వద్ద ఎవరికి వారు ఫొటోలు దిగి ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

మహిళా భవనం ప్రారంభం

మన్సూరాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి వృథాగా ఉన్న స్థలంలో కాలనీ సభ్యులంతా ఓ మంచి నిర్ణయంతో వారి సొంత నిధులతో అమ్మవారి ఆలయాన్ని మిగిలిన మరికొంత స్థలంలో మహిళా భవనం నిర్మించుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ బాలాజీనగర్ కాలనీలో శనివారం నూతనంగా నిర్మించిన బాలాజీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ మహిళా భవనాన్ని స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు కొండారెడ్డి, రాఘవరెడ్డి, రమణారెడ్డి, సుధ, పావని, మాధవి, మంజుల, నాగ, పద్మ, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, టంగుటూరి నాగరాజు, పోచబోయిన జగదీశ్‌యాదవ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

నీరా కేఫ్‌ను గౌడ కార్పొరేషన్‌కు అప్పగించాలి

● గౌడ సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తి

ఖైరతాబాద్ : మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ టూరిజం శాఖ ఎండీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, ఆయన్ను ప్రభుత్వం సస్పెండ్ చేయాలని గౌడ సంఘాలు డిమాండ్ చేశాయి. నీరా కేఫ్‌లోని గౌడ ప్రతిమలు తొలగించి ఆస్తులను ధ్వంసం చేసిన కాంట్రాక్టర్ శంకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గౌడ సంఘాల ప్రతినిధులు శనివారం లేక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ గౌడల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే నీరా కేఫ్‌ను గీత కార్పొరేషన్‌కు దక్కకుండా టూరిజం శాఖ ఎండీ కుట్ర చేశారన్నారు. శంకర్‌రెడ్డికి ఇచ్చిన కాంట్రాక్టును గౌడ సంఘాల ఆందోళనలతో రద్దు చేసినప్పటికీ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నీరా కేఫ్‌లో ఇప్పటి వరకు జరిగిన లావాదేవీల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తిగా భావించే నీరా కేఫ్ ఆస్తులను ధ్వంసం చేసిన శంకర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, కేఫ్‌ను గీత కార్పొరేషన్‌కు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. బండి సాయన్నగౌడ్, చీకటి ప్రభాకర్ గౌడ్, చెక్కిళ్ల మధుసూదన్‌గౌడ్, వంగా సదానందంగౌడ్ పాల్గొన్నారు.







మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్, ఫిష్ విక్రయ స్టాల్, వస్త్ర కుట్టు శిక్షణ స్టాల్


ఇందిరా మహిళా శక్తి సభలో ఆకట్టుకున్న స్టాల్స్

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు

హైదరాబాద్ సిటీ/ మారేడ్‌పల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సభలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా సంఘాల సభ్యులు తమ ఉత్పత్తులు ప్రదర్శించారు.

ఇందిరా మహిళా శక్తి బస్సులు ప్రారంభం

పరేడ్ గ్రౌండ్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో టీజీఎస్ఆర్టీసీకి చెందిన 20 ఇందిరా మహిళా శక్తి బస్సులను సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి ప్రారంభించారు. సాయంత్రం 4 తర్వాత మహిళలు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.



సభకు తరలివచ్చిన మహిళలు

64 లక్షల మందికి ఉపాధి

రాష్ట్రంలో సెర్ప్-మెప్మాతో మహిళా సంఘాల ద్వారా 64 లక్షల మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. మహిళా సంఘాలు గ్రూపులుగా ఏర్పడి తయారు చేస్తున్న అన్ని రకాల ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ఆదరణ లభిస్తోంది.

- ఎంవీ కృష్ణ, సెర్ప్ డైరెక్టర్

32 జిల్లాల్లో 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు

తెలంగాణ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలకు 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ కేటాయించాలని నిర్ణయించింది. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం 32 జిల్లాల్లో మహిళా సంఘాలకు 2 మెగావాట్ల చొప్పున 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుతో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

- వావిల్లా అనిలా, టీజీఎస్ రెడ్కో, ఎండీ



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తీగల కనిష్క్‌రెడ్డి తల్లిదండ్రులైన తీగల అజిత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తీగల సునరితా రెడ్డి కుటుంబీకులను పరామర్శించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఆయన వెంట ఆజంఅలీ, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి తదితరులు.


- చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను వడ్డీపై ప్రవేశపెట్టిన రాయితీ వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం(ఓటీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట సర్కిల్6 డిప్యూటీ కమిషనర్ జయంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తిపన్ను పెండింగ్ బకాయి వడ్డీపై 90శాతం రాయితీ కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ రాయితీ ఈనెల 31 వరకు ఉంటుందని ప్రజలు రాయితీని సద్వినియోగం చేసుకొని పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు.

న్యాయం కోసం భర్త ఇంటి ఎదుట నిరసన

వనస్థలిపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భర్తతో తనకు న్యాయం కావాలంటూ బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లోని భర్త ఇంటి ఎదట నిరసన వ్యక్తం చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ బుద్వేల్‌కు చెందిన జయవాణి(45) వనస్థలిపురం వైదేహినగర్‌కు చెందిన మేకల దీపక్(47)తో 2003లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. ఆ సమయంలో జయవాణి తల్లిదండ్రులు దీపక్‌కు వరకట్నం కింద 1 మారుతి కారు, 5లక్షల కట్నం, 20 తులాల బంగారం, 2లక్షల ఇంటి సమాను, 50వేలు ఇంట్లోకి ఇచ్చారు. కాగా వీరికి కూతురు చరిత(19), కొడుకు చరణ్(18) ఇద్దరు పిల్లలు. ఈ క్రమంలో 2005 నుంచి దీపక్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న విషయం జయవాణికి తెలిసింది. దీంతో వీరిద్దరు మధ్య మనస్పర్థలు రావడంతో దీపక్ తన భార్య జయవాణిని వేధింపులకు గురిచేస్తున్నాడు. పలుమార్లు పెద్దల సమక్షంలో కూర్చొని మాట్లాడినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో జయవాణి తన ఇద్దరు పిల్లలతో కలిసి తన పుట్టింటి వద్ద ఉంటుంది. దీంతో తనకు న్యాయం కావాలని జయవాణి కోర్టు మెట్లు ఎక్కడంతో సదరు కోర్టు దీపక్, జయవాణి దంపతులు తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగించాలని ఫిబ్రవరి 27న ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు తనతో కలిసి పిల్లలతో జీవనం సాగిస్తానని జయవాణి తన భర్త తరఫున ఉన్న న్యాయవాదికి తెలిపానని పేర్కొంది. విషయం తెలుసుకున్న దీపక్ తన ఇంటికి తాళం వేసుకుని తప్పించుకుని తిరుగుతూ తనని, తన పిల్లలను మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని విలపించింది. ఈ మేరకు కోర్టు ఇచ్చిన తీర్పు పత్రాలను వెంటపెట్టుకుని తనకు న్యాయం కావాలని శనివారం తన తల్లిదండ్రులతో కలిసి బాధితురాలు జయవాణి భర్త ఇంటి ముందు కూర్చొని నిరసన కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసన వ్యక్తం చేస్తున్న సదరు మహిళను, వారి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి కోర్టు ఆదేశాల మేరకు నడుచుకోవాలని సూచించడంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. మహిళా దినోత్సవం రోజున తనకు న్యాయం కావాలని కట్టుకున్న భర్త ఇంటి ఎదుట భార్య నిరసనకు దిగడం బాధాకరమని పలువురు కాలనీ మహిళలు వాపోయారు.




న్యాయం కావాలంటూ భర్త ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న జయవాణి

దర్గాగా టెలిఫోన్ శాఖ స్థలం కబ్జాకు యత్నం

● స్థానికులు అడ్డుకోవడంతో నిలిచిన పనులు

సైదాబాద్ : ఐఎస్ సదన్ డివిజన్ చింతల్‌బస్తీ, రెడ్డికాలనీ జనవాసాల మధ్య ఖాళీగా ఉన్న టెలిఫోన్ శాఖ స్థలంపై కబ్జాదారుల కన్నుపడింది. వరుస సెలవు దినాలు(శని, ఆదివారాలు) ఉండడంతో శుక్రవారం రాత్రి నుంచి రంగంలో దిగారు. కబ్జాదారులు భారీ వాహనాల్లో మట్టిని తీసుకుని కుప్పలుగా పోయసాగారు. స్థానికులు అడ్డుకోవడంతో తాత్కాలికంగా పనులు నిలిపివేశారు. ఐఎస్‌సదన్ డివిజన్ చింతల్‌బస్తీ (నీలం రాజశేఖర్‌రెడ్డినగర్) సమీప ప్రాంతంలోని సంగం లక్ష్మిబాయి ట్రస్టుకు చెందిన ఎనిమిది ఎకరాల స్థలాన్ని నాలుగు దశాబ్దాల కిందటే కేంద్రప్రభుత్వ రంగ సంస్థ టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌కు కేటాయించారు. అందులో కొంతభాగం టెలికాం శాఖ ఉద్యోగుల గృహసముదాయం నిర్మించారు. మరికొంత స్థలంలో 30సంవత్సరాలుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. గుడిసెవాసులు నివసిస్తున్న ప్రాంతం చింతల్‌బస్తీగా స్థిరపడింది. కొంతకాలంగా గుడిసెలు ఖాళీ చేయాలంటూ పలుమార్లు టెలిఫోన్‌శాఖ గుడిసెవాసులకు నోటీసులు జారీచేసింది. గుడిసెలు, ఉద్యోగుల క్వార్టర్స్ పక్కనే కొంత మేర సుమారు ఎకరం టెలిఫోన్ శాఖ ఆధీనంలో ఉంది. చుట్టూ ప్రహరీగోడ సైతం గతంలో కట్టారు. కానీ కొద్ది సంవత్సరాలు ఈ స్థలంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కబ్జాదారుల కన్నుపడింది. ఇప్పటికే కొంత మేర ఆక్రమణదారులు ఆక్రమించుకోగా, మిగతా ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించారు. ఇప్పటికైనా టెలిఫోన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



టెలిఫోన్ శాఖ స్థలంలో పోసిన మట్టికుప్పలు